ప్రజాశక్తి
సోమవారం 14 జూలై 2025
5
విజయనగరం

జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు
దరఖాస్తుల గడువు పెంపు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జాతీయ ఉపాధ్యాయ అవార్డులు- 2025 నమోదు, తుది సమర్పణకు ఈ నెల 20వ తేది వరకు గడువు పొడిగించినట్లు డిఇఒ మాణిక్యంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు నమోదు చేసుకున్న ఉపాధ్యాయులు అందరూ తుది సమర్పణను ఈ నెల 20లోపు పూర్తి చేయాలని చెప్పారు. ఉపాధ్యాయుల ఆన్లైన్ నమోదు కొరకు కాలపరిమితిని 13 నుండి 17వ తేది వరకు, దరఖాస్తుల తుది సమర్పణ కాలపరిమితిని 15 నుంచి ఈ నెల 20 వరకు పెంచినట్లు వివరించారు. దరఖాస్తులను https://nationalawardstoteachers.education.gov.in/Login.aspx ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఉచిత పంటల బీమాకు రాం.. రాం

ఇంతకు ముందులా ఉచిత పంటల బీమా లేదు. అటువంటి బీమాతో ఉంటే రైతులు మరింతగా నష్టపోయినట్టే. ఎందుకంటే? గత ఆరేళ్లు అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి ప్రభుత్వం చెక్ పెట్టింది. ఇక నుంచి రైతులే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించుకోవాలి. పెరిగిన వ్యవసాయ మదుపులకు ఇదో అదనపు పెట్టుబడిగా భావించాల్సిందే. లేదంటే కరువు కాటకాల వేళ బీమా పొందే అవకాశాన్ని అయినా వదులుకోవాల్సి ఉంది.

- ఇన్సూరెన్స్ ప్రీమియం రైతులు చెల్లించుకోవాల్సిందే
- బాధ్యత నుంచి తప్పుకున్న ప్రభుత్వం
- ఎకరా పత్తికి రూ.1923, వరికి రూ.200



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అతివృష్టి, అనావృష్టి వంటి సందర్భాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఇటువంటి సందర్భాల్లో కనీసం పెట్టిన పెట్టుబడి అయినా పదిలం చేసుకునేందుకు పంటల బీమా పథకాన్ని ప్రభుత్వాలు దశాబ్దాల తరబడి ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గతంలో వైసిపి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింపజేసింది. బ్యాంకు రుణాలు తీసుకోవడం, ఇ-క్రాప్ బుకింగ్ వంటి సందర్భాల్లో రైతులకు ప్రభుత్వం తరపున నేరుగా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేది. దీంతో రైతులకు కొంతలో కొంత ఊరట ఉండేది. కూటమి ప్రభుత్వం తాజాగా ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసింది. బ్యాంకు రుణాల సందర్భంగా ఇన్సూరెన్స్ పొందలేని రైతులు సొంతంగా బీమా ప్రీమియం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేదంటే బీమా ఆశలను వదులుకోవాల్సిందే. ఈ ఏడాది ఎప్పటి మాదిరిగానే మన జిల్లాలో పత్తి, వరి, మొక్కజొన్న, నువ్వుల పంటలకు వర్తింపజేసింది. ఈ పంటలన్నింటికీ ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కంపెనీకి ఎకరా పత్తి విస్తీర్ణానికి రూ.1923 చొప్పున ప్రీమియం చెల్లించాలి. వరికి రూ.200, మొక్కజొన్నకు రూ.165, నువ్వులకు రూ.65 చొప్పున ప్రీమియం చెల్లించాలి. ఇందుకుగాను పత్తికి రూ.95 వేలు, వరికి రూ.40 వేలు, మొక్కజొన్నకు రూ.33 వేలు, నువ్వులు రూ.13 వేలు చొప్పున బీమా వర్తిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీ నిబంధనల ప్రకారం... వరి పంటకు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని నష్టాన్ని పరిగణిస్తారు. మిగిలిన మూడు రకాల పంటలకు మండలాన్ని యూనిట్‌గా తీసుకుని నష్టాన్ని పరిగణించనున్నారు.

పత్తి రైతులకు ఒక్కరోజే గడువు

పత్తి రైతులు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపునకు ఒక్కరోజు మాత్రమే గడువు ఉంది. ఈనెల 15వ తేదీతో గడువు ముగియనుంది. మొక్కజొన్న, నువ్వుల పంటకు ఈ నెలాఖరులోపు చెల్లించుకోవాలి. వరి పంట ఇన్సూరెన్స్‌కు ఆగస్టు 15వ వరకు సమయం ఉంది. ఇప్పటికే ఎరువులు, విత్తనాల ధరలు, ట్రాక్టర్ అద్దెలు అమాంతంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో ఇన్సూరెన్స్ చేసుకునేందుకు రైతులు ముందుకు రాలేకపోతున్నారు. మరోవైపు ప్రీమియం చెల్లింపునకు గడువు సమయం ముంచుకొస్తుండటంతో రైతుల్లో బీమా దీమా సన్నగిల్లుతోంది.

ఖరీఫ్‌కి రైతులు సంసిద్ధమై, ఆకుమడులు తయారు చేసి ఉబాలకు సిద్ధం చేశారు. ఆకుమడులకు యూరియా లేకపోవడంతో రైతులు ఇక్కట్లు అన్ని ఇన్ని కావు.. రైతులు యూరియా కోసం రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోతోంది. కొన్ని రైతు సేవా కేంద్రాలకు యూరియా వచ్చినా అవి పలుకుబడి ఉన్న నాయకులకే అందజేయడంతో సన్న, చిన్నకారు రైతులకు కరువైంది.. దీంతో రైతులు ప్రయివేట్ దుకాణాలకు వెళ్లి అధిక ధరలకు యూరియా కొనుగోలు చేసి ఆకుమడులను కాపాడుకుంటున్నారు. రైతు సంక్షేమ ప్రభుత్వమంటూ పాలకులు ఊకదంపుడు ప్రసంగాలు, ప్రకటనలు తప్ప రైతుకు ఒరిగేది ఏమీ లేదని వారంతా వాపోతున్నారు.

ప్రయివేటు దుకాణంలో యూరియా బస్తాల నెట్టు

యూరియా లేక
రైతులకు ఇక్కట్లు

- 11 ఆర్‌ఎస్‌కెల్లో అందుబాటులో లేని వైనం
- ప్రయివేట్ దుకాణాల్లో అధిక ధరలకు యూరియా కొనుగోలు

ప్రజాశక్తి-రేగిడి

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్ని, ఆకుమడులు తయారు చేశారు. విత్తనాలు చల్లి ఉబాలకు సిద్ధం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో యూరిత కొరత రైతుల్ని కలవరపెడుతోంది. రేగిడి మండలంలో 25 సచివాలయాలకు గాను 21 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 11 రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ అసిస్టెంట్లు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ఇంకా ఎవరూ రాలేదు. వాస్తవంగా వ్యవసాయ అధికారులు మండలానికి ఎంత యూరియా, పొటాష్ అవసరమో లెక్కలు వేసి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించి నిల్వలు ఉంచాలి. కానీ ఆ దిశగా మండల వ్యవసాయ అధికారులు చొరవ చూపలేదు. వాటి ఫలితంగా ఈ ఖరీఫ్ వ్యవసాయానికి యూరియా కరువు అవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఆకుమడుల కోసం యూరియా అవసరమై రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా ఎక్కడా అందుబాటులో ఉండటం లేదు. ప్రయివేటు ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో ఈ ఏడాది పంటలు పండించాలా? లేదా? అనే ఆలోచనలో రైతులు డీలాపడ్డారు.

బదిలీల్లో భాగంగా వ్యవసాయ ఉన్నతాధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో ఈ ఏడాది యూరియా కరువుకు కారణమని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ వ్యవసాయానికి పాలకులకు, వ్యవసాయ అధికారులకు ముందుచూపు లేని కారణంగా రైతులు భారీ మూల్యం చెల్లించుకున్నారు. భవిష్యత్తులో ఖరీఫ్, రబీ సాగుకు అధికారులు ముందుగా ప్రణాళికలు చేపట్టి రైతులకు విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా చూడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

బదిలీలతో ప్రతిపాదనల్లేవు

యూరియా కొరత విషయంపై ఇన్‌ఛార్జి మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మిని వివరణ కోరగా, 25 సచివాలయాలకు గాను 21 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. వీటిలో 11 రైతు సేవా కేంద్రాలలో సిబ్బంది లేకపోవడంతో యూరియా, పొటాష్ వంటివి ప్రతిపాదనలు తయారు చేయకపోవడం ఇబ్బంది కలిగిందని తెలిపారు. మిగతా రైతు సేవా కేంద్రాల్లో వన్‌బి ప్రకారం కొంతమంది రైతులకు ఎరువులు అందించామన్నారు.

బొబ్బిలి వీణకు గుర్తింపుతో
జిల్లా ప్రతిష్ట మరింత పెంపు

ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మాట్లాడుతున్న ఎమ్‌పి కలిశెట్టి

బొబ్బిలి వీణకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో జిల్లా ప్రతిష్ట మరింత పెరిగిందని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొబ్బిలి వీణల తయారీకి ముడిసరుకు కొంత కొరత ఉందన్నారు. దాని నివారణకు బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయనతో మాట్లాడి, చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఇప్పటికే ఎరువుల కొరత లేకుండా చేయడానికి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ఎరువుల విషయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏడాది పాలనలో సంక్షేమం, అభివృద్ధిపై దృష్టిపెట్టిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి టీం ప్రజలను డైవర్షన్ చేయడానికి, గత ఐదేళ్లలో సాగించిన విధ్వంసం, దౌర్జన్యం కొనసాగించడానికి చూస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వ్యక్తులను భయాందోళనకు గురి చేసేలా వీరి చర్యలు ఉంటున్నాయని తెలిపారు. జమిలి ఎన్నికలు వచ్చేస్తాయని జగన్మోహన్ రెడ్డి అంటున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తమ కూటమి సిద్ధంగా ఉందని చెప్పారు. మరోసారి ప్రజలే వైసిపికి బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శి ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, బంగారు బాబు, మండల కార్యదర్శి గంటా పోలినాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోసగించడంలో చంద్రబాబు దిట్ట

శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

సిఎం చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేయడంలో దిట్టని వైసిపి సీనియర్ నాయకులు, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. ఆదివారం నగరంలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్లో వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బొత్స మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోలో పేర్కొన్న ఏ ఒక్క పథకాన్నీ అమలు చేయకుండా మోసం చేశారన్నారు. ఏడాదిన్నర కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్లే బాధ్యత కలిగిన ప్రతిపక్ష పార్టీగా నేడు ప్రజల వద్దకు రావాల్సి వచ్చిందన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వాన్ని మెడలు వంచి హామీలు అమలు చేయించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అందుకే బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ పేరుతో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అనంతరం వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖరరావు మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో విజయనగరం నగరాన్ని చూస్తే అర్థమవుతుందని ఎద్దేవాచేశారు. సమావేశంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, పార్టీ పరిశీలకులు కిల్లి సత్యనారాయణ, డిప్యూటి మేయర్లు, కార్పొరేటర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలు చేపట్టాలని
16న చలో కలెక్టరేట్

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాము, వెంకటేష్
- ముగిసిన జిల్లా ప్లీనరీ.. 12 తీర్మానాలకు ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిగ్రీ ప్రవేశాలు వెంటనే చేపట్టాని ఈ నెల 16న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టనున్నామని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్.వెంకటేష్ తెలిపారు. నగరంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం ప్రారంభమైన ఎస్‌ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్లీనరీ తీర్మానాలను మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీలో ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి, ఆఫ్‌లైన్‌లోనే అడ్మిషన్లు చేపట్టాలని, డబల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాజాం, గజపతినగరం విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి హాస్టళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. 107, 108 జిఒలను రద్దుచేసి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్ల అమ్మకాన్ని ఆపాలని, మెడికల్ కాలేజీ భవనాలు పూర్తి చేసి, కళాశాలకు అనుబంధంగా వసతిగృహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థలో ఉన్న సంక్షేమ హాస్టళ్లకు సొంతభవనాలు నిర్మించాలన్నారు. ఎటువంటి షరతులూ లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ తల్లికి వందనం పథకంలో రూ.15 వేలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించి, నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. విద్యార్థులకు హాస్టల్, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. జిఒ నెంబర్ 19, 20, 21ను రద్దుచేసి పాఠశాలల విలీనాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, మండలానికి ఒక పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ఈ అంశాలపై ప్లీనరీలో తీర్మానాలు చేశామని, వాటి సాధన కోసం భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు. సమావేశంలో ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పావని, జిల్లా ఉపాధ్యక్షులు వి.చినబాబు, జిల్లా గర్ల్స్ కో-కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ ఆర్.శిరీష పాల్గొన్నారు.

విద్యాసంస్థలకు సమీపంలో
పొగాకు ఉత్పత్తుల విక్రయంపై నిషేధం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

షాపులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

జిల్లాలో విద్యాసంస్థలకు సమీపంలోని పాన్ షాపుల్లో, కిరాణా దుకాణాల్లో సిగరెట్లు, నిషేధిత ఖైనీ, గుట్కాలు, మత్తు కలిగించే ఇతర పొగాకు వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో స్థానిక పోలీసులు, ఈగల్, ఎస్‌బి సిబ్బంది సంయుక్తంగా విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పాన్‌షాపులు, కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించామని చెప్పారు. ఇందులో భాగంగా గత ఐదు రోజులుగా జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలకు సమీపంలోని పాన్ షాపులు, కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులను విక్రయించిన 512 మంది వ్యాపారులపై కోటా చట్టం (ది సిగరెట్స్ అండ్ అదర్ పొగాకు ప్రొడక్ట్స్ 2003 చట్టం) ప్రకారం కేసులు నమోదు చేసి, వారిపై రూ.1,13,900ను జరిమానాగా విధించామని వివరించారు. విద్యాలయాలకు దగ్గరలో ఉన్న పాన్, కిరాణా షాపుల్లో పొగాకు ఉత్పత్తులను విక్రయించడం వల్ల విద్యార్థులు వీటిని వినియోగించేందుకు అలవాటుపడి, వక్ర మార్గంలో ప్రయాణించే అవకాశం ఉందని వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పొగాకు ఉత్పత్తులను విక్రయించకుండా చర్యలు చేపట్టేందుకు వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు స్వస్తి పలకాలని కోరారు. ఈ తరహా దాడులు భవిష్యత్తులో మరింత విస్తృతం చేస్తామని చెప్పారు.

విజయనగరం
వన్‌టౌన్ సిఐగా చౌదరి

ప్రజాశక్తి కంటోన్మెంట్

విజయనగరం వన్‌టౌన్ సిఐగా ఆర్‌విఆర్‌కె చౌదరిని నియమిస్తూ డిఐజి గోపినాథ్ జెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. వన్‌టౌన్ సిఐగా పనిచేసిన ఎస్.శ్రీనివాస్‌ను విఆర్‌కు అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో స్పెషల్ బ్రాంచ్ సిఐగా పనిచేస్తున్న చౌదరిని వన్‌టౌన్ సిఐగా నియమించారు.

ఐటిఐలో రెండో విడత ప్రవేశానికి
దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో 3 ప్రభుత్వ, 25 ప్రయివేటు ఐటిఐల్లో రెండో విడత ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈ నెల 20వ తేది వరకు పెంచినట్లు ఐటిఐ కళాశాలల జిల్లా కన్వీనర్ టివి.గిరి తెలిపారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రిజిస్ట్రేషన్ పూర్తిచేశాక యునిక్యూ నంబర్‌తో ఈ నెల 22 మధ్యాహ్నం ఒంటిగంటలోపు సమీపంలోని ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని చెప్పారు. ప్రభుత్వ ఐటిఐలకు 23, 25న, ప్రయివేట్ ఐటిఐలలో 25 నుంచి 27 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9441518355, 9849944654, 7780658035 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆపస్ జిల్లా ప్రధాన
కార్యదర్శిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆదివారం జిఆర్ కాంప్లెక్స్‌లో ఉన్న జిల్లా శాఖా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఇంతవరకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న వివిజె సుబ్రమణ్యాన్ని రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకున్నారు. ఆయన స్థానంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీనివాసరావును ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాలాజీ ప్రకటించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ప్రభావతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఎం.ప్రభావతి తెలిపారు. వాకర్స్ క్లబ్ ఉద్యమకారులు, పూర్వ ఇంటర్నేషనల్ అధ్యక్షులు కీర్తిశేషులు జె.ఎల్. తోష్నివాలా 95వ జయంతిని అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు అధ్యక్షతన ఆదివారం స్థానిక అయ్యన్నపేట చెరువు పక్కనున్న మున్సిపల్ నడక మైదానంలో క్లబ్ ఘనంగా నిర్వహించారు. తోష్నివాలా చిత్రపటానికి ప్రభావతి పూలమాల వేసి నివాళులర్పించారు. నడక మైదానంలో మొక్కలు నాటారు. అనంతరం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం క్లబ్ గౌరవ అధ్యక్షులు పిన్నింటి సూర్యనారాయణ, డాక్టర్ ఎ.ఎస్ ప్రకాశరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కో-ఆర్డినేటర్ జి.కృష్ణంరాజు, మాజీ డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ కె.ఎర్నాయుడు, ఎం.ప్రభావతిని ఘనంగా సత్కరించారు. మజ్జిగ చలివేంద్రానికి సేవలందించిన చందక ప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు నాగలక్ష్మి, శ్రీ సాయికృష్ణ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ, ప్రగతి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసరావు, రామసాయి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కొల్లి సత్యం, పిడుగు సతీష్, లాలిశెట్టి రవితేజ, లోపింటి కళ్యాణ్, చిట్టి రాజు పాల్గొన్నారు.

అవయవ దానంతో ప్రాణదానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

అవయవదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని జిల్లా గ్రంథాలయ సేవా సంఘం, కళాశాల కమిటీ కన్వీనర్ బి.రామభద్ర రాజు అన్నారు. ఆదివారం స్థానిక మహారాజా కళాశాలలో అవయవదాత గండి పల్లవి జ్ఞాపకార్థం అవయవ దానంపై అవగాహన కార్యక్రమాన్ని ఎన్‌సిసి, గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్, తిరుమల మెడికవర్ ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి అవయవ దానం ద్వారా ఎనిమిది మంది జీవితాలలో వెలుగులను నింపవచ్చన్నారు. ఎన్‌సిసి ప్రిన్సిపల్ కళ్యాణ్ అశోక్ మాట్లాడుతూ అవయవదాన ఉద్యమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, పి.సతీష్ పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో మౌలిక సౌకర్యాల కల్పన

- రెండు నెలల్లో భవన నిర్మాణాలు పూర్తిచేస్తాం
- జిల్లాలో మందుల కొరత లేదు
- 'ప్రజాశక్తి'తో ఏపి ఎంఎస్ఐడిసి ఇఇ ఎన్.భారతి ముఖాముఖి



ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్టర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపిఎంఎస్ఐడిసి) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.భారతి తెలిపారు. ఆస్పత్రుల్లో భవనాల నిర్మాణం, మరమ్మతులు చేపడుతున్నామని వివరించారు. మరో రెండు నెలల్లో భవనాలన్నీ పూర్తిస్థాయి అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మందుల కొరతలేదని, ప్రభుత్వ కేటాయించిన మందులను ఆయా సిహెచ్‌సిలు, పిహెచ్ఇలకు, ప్రభుత్వ ఆస్పత్రులకు అందిస్తామన్నారు. మూడు నెలలకు ఒకసారి మందులు వస్తాయని తెలిపారు. రాష్ట్ర స్థాయిలోనే జిల్లాలకు మందులు కేటాయిస్తారని చెప్పారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆమె ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

ఉమ్మడి జిల్లాలో ఎన్ని భవనాలు నిర్మాణాల్లో ఉన్నాయి.? ఎన్ని పూర్తయ్యాయి.?

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎపిఎంఎస్ఐడిసి ద్వారా పలు ఆస్పత్రుల్లో భవనాల నిర్మాణాలను చేపడుతున్నాం. విజయనగరం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలతోపాటు ఘోషాసుపత్రిలో మూడు పనులను చేస్తున్నాం. లిఫ్టు, వైద్య పరికరాలు, పాడైన క్వార్టర్స్ నిర్మాణ పనులు చేపడుతున్నాం. లిఫ్ట్ సామగ్రికి టెండర్లు పిలిచాం. గజపతినగరం, శృంగవరపుకోట, కురుపాం, సాలూరు, భద్రగిరి, నెల్లిమర్ల, బాడంగి ఆస్పత్రుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. గజపతినగరం సిహెచ్‌సికి రూ.17 కోట్లు, ఎస్.కోటకు రూ.12.6 కోట్లు, కురుపాంకు రూ.3 కోట్లు, సాలూరుకు రూ.17 కోట్లు, బాడంగికి రూ.8.88 కోట్లు భద్రగిరికి రూ.8.95 కోట్లు, నెల్లిమర్లకు 4.42 కోట్లు, పార్వతీపురం 21.15 కోట్లు నిధులను ప్రభుత్వం కేటాయించింది. మరో రెండు నెలల్లో పూర్తిగా భవన నిర్మాణాలు పూర్తయి, అందుబాటులోకి వస్తాయి.

ఎన్ని ఆస్పత్రుల్లో మరమ్మతులు చేపడుతున్నారు.?

ఉమ్మడి జిల్లాలో సాలూరు ఆస్పత్రికి రూ.20 లక్షలు, చీపురుపల్లికి రూ.9 లక్షలు చొప్పున మరమ్మతులకు నిధులు కేటాయించారు. రిపేరు పనులు జరుగుతున్నాయి.



గత మూడేళ్లలో జిల్లాకు ప్రభుత్వం మందులకు కేటాయించిన నిధులు ఎంత.?

రాష్ట్ర ప్రభుత్వం ఎపిఎంఎస్ఐడిసి ద్వారా జిల్లాలోని వివిధ ఆస్పత్రులకు మందులను పంపిణీ చేస్తుంది. ప్రధానంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి మందులు, సర్జికల్స్ రూపంలో మందులు అందిస్తుంది. 2023- 24లో మందుల కింద రూ.20,82,15,360, సర్జికల్స్‌కు రూ.5,62,31,392, రూ. 2024- 25లో మందులకు రూ.22,83,51,127, సర్జికల్స్‌కు రూ.5,78,19,435, 2025-26లో గత మూడు నెలలకు గాను మందులకు రూ.8,12,62,975, సర్జికల్స్ రూపంలో రూ.2,07,54,213ను ప్రభుత్వం కేటాయించింది. జిల్లాలో మందుల కొరత లేదు. పిహెచ్ఇలకు, ఆస్పత్రులకు మందులను సక్రమంగా అందిస్తున్నాం.

జిల్లా కేంద్రంలో ఎపిఎంఎస్ఐడిసి కార్యాలయంలో గతంలో పని చేసిన ఇఇ శానిటేషన్‌కు టెండర్ లేకుండా చేయించారన్న ఆరోపణలు వచ్చాయి.?

నేను కొద్ది రోజుల క్రితమే ఇఇగా విధుల్లో చేరాను. నా దృష్టికి ఈ విషయం రాలేదు.

కార్యాలయంలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా.?

కార్యాలయంలో పర్మినెంట్‌తోపాటు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పని చేస్తున్నారు. ఎక్కువగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం
సాలూరు తాలూకా అధ్యక్షులుగా చొక్కాపు

ప్రజాశక్తి - రామభద్రపురం

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘ ఎన్నికలు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన రామభద్రపురం, సాలూరు, పాచిపెంట, మక్కువ జిల్లా పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ ఎన్నికలు ఏకగ్రీవం కాగా అధ్యక్షులుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చొక్కాపు శ్రీరాములునాయుడు ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సాలూరు గ్రామీణ నీటి సరఫరా విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె. రమణమ్మ, జిల్లా కౌన్సిల్ మెంబర్-1గా స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో టైపిస్ట్ బి.సంతోష్‌కుమార్, కౌన్సిల్ మెంబర్-2గా సాలూరు వేద సమాజం స్కూల్ రికార్డ్ అసిస్టెంట్ బి.గౌరునాయుడు, వైస్ ప్రెసిడెంట్‌గా మక్కువ ఎంపిడిఒ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ బి.అరికెకిరికె నాయుడు, ట్రెజరర్‌గా సాలూరు ఎంపిడిఒ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ ఎన్. హరికృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పాచిపెంట ఎంపిడిఒ కార్యాలయంలో టైపిస్ట్ ఎన్.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికైన వారందరూ ప్రమాణం చేసి తమకు కేటాయించిన ఈ పదవులకు న్యాయం చేస్తామని ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించేటట్టు న్యాయం చేస్తామని ప్రమాణ చేశారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- డెంకాడ

తల్లికి వందనం పథకాన్ని అందరికీ వర్తించేలా కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి చిత్రపటాలకు మండలంలోని జొన్నాడలో శనివారం రాత్రి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమం మండల జనసేన నాయకులు మట్టాడ ప్రమీల ఆధ్వర్యంలో సీనియర్ జనసేన నాయకుడు దిండి రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా ఉత్తరాంధ్ర మహిళా రీజనల్ కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మి రాజ్, క్లస్టర్ ఇంచార్జి పాల్ శ్రీను హాజరయ్యారు. అనంతరం ప్రభుత్వ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఐటి రాజారావు, కోన రామకృష్ణ, కోన శివ, వీర మహిళలు భవాని, రాధా, బలస శివ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - వేపాడ

మండల వైసిపి అధ్యక్షులు ఎం.జగన్నాథం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోంపురం సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపిటిసి ఆకుల సత్యనారాయణ, పాటూరు మాజీ సర్పంచ్ గంగునాయుడు తదితరులు పాల్గొని ఎమ్మెల్యేను సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

పండగలో పాల్గొన్న రైతులు

సంప్రదాయంగా పశువులమ్మ పండగ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామంలో ఆదివారం పశువులమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరూ పశువులను ముస్తాబు చేసి పశువులమ్మ ఆలయం వద్దకు తరలించి ఒకచోట పశువులను నిలబెట్టి అమ్మవారిని పశువుల చుట్టూ మూడుసార్లు ప్రదర్శన జరిపి పశువులపై ముగ్రాటన జల్లి పశువులకు ఆరోగ్యంగా ఉండాలని, పంటలు బాగా పండే విధంగా అమ్మవారు కరుణించాలని వేడుకున్నారు. ఈ పండగను గ్రామ పెద్దలు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఉక్కపోతకు ఉపశమనం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో ఎండలతో మండిపోయిన ప్రజలు కొంత ఉపశమనం పొందారు. గత మూడు రోజులుగా ఎండ, ఉక్కబోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం లభించింది.

మొక్కలను పంపిణీ చేస్తున్న రామకృష్ణ

మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకుడు బొబ్బిలి రామకృష్ణ ఆదివారం ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. స్థానిక జియో నర్సరీ నుండి అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అరవై జుంబో నేరేడు, పూల మొక్కలను పంపించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ జియో సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జియో సభ్యులు హృషీకేశ్, లాస్యశ్రీ, సన్యాసిరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జిఆర్‌టి బంగారం షాప్ ప్రారంభం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

పట్టణంలోని ఎమ్‌జి రోడ్డు సమీపంలోని డాబా తోట వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జిఆర్‌టి జువెలరీ షోరూమ్‌ను ఆదివారం ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జిఆర్ ఆనంద్ అనంత పద్మనాభం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరంలో తమ 66వ బ్రాంచ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ షోరూమ్‌లో బంగారంతో పాటు వజ్రం, ప్లాటినం, వెండి రత్నాలు, ఆభరణాలను అందుబాటులో ఉంచుతున్నామన్నరు. బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.150 తగ్గిస్తామన్నారు. పాత బంగారాన్ని మార్చుకుంటే గ్రాముకు అదనంగా వంద ప్రయోజనం చేకూరుస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ జిఆర్. రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడుల నుంచి రక్షించండి

◆ఎమ్మెల్యేకు ప్రయివేటు డీలర్ల వినతి ◆ఇష్టారీతిగా నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మకాలు ◆ షాపులపై వ్యవసాయాధికారులు, విజిలెన్స్ ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి - చీపురుపల్లి

విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయాలపై ప్రజలు, రైతుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తుంటే తమపై చేస్తున్న తనిఖీల నుండి తమకు రక్షణ కావాలంటూ మండలానికి చెందిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తున్న డీలర్లు స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావుకి శనివారం రాజాంలోని ఆయన నివాసానికి వెళ్లి వినతినిచ్చారు. ఒక పక్క రైతుల తమకు ప్రైవేటు డీలర్ల నుండి నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు ఏ డీలర్ అయినా రైతులను మోసం చేసే విధంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించే క్రమంలో నాసిరకం గాని ఎంఆర్‌పి ధరలకంటే ఎక్కువ గాని అమ్మితే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించడంతో పాటు డీలర్లపై చర్యలు తీసుకోవడానికి కూడా వ్యవసాయాధికారులు వెనుకాడడం లేదు. ఈ తరుణంలో తమపైనే తనిఖీలు చేస్తారా అంటూ డీలర్లంతా నేరుగా ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారంటే డీలర్ల వద్ద ఎంత ఎక్కువ నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు నిల్వ ఉన్నాయో అంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఖరీఫ్ సీజన్ కావడంతో వ్యవసాయ పంటలలో రైతులు బిజీగా ఉండడంతో తమకు కావలసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలుకు ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు ఎంఆర్‌పి ధరలకు కాకుండా అధిక ధరలకు రైతులకు విక్రయించడంతో రైతులు సంబంధిత అధికారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమై ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తుంటే తమపై అధికారులు తనిఖీలు నిర్వహించకుండా అడ్డుకోవాలని నేరుగా స్థానిక ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

ఎరువుల దుకాణం వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎఒ

రసీదులూ ఇవ్వడం లేదు..

ఎమ్మెల్యేకు వినతినిస్తున్న ప్రయివేటు డీలర్లు

విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించేటప్పుడు తప్పనిసరిగా రైతులకు రశీదులను సంబంధిత డీలర్లు ఇవ్వాల్సి ఉంది. కాని అవేమీ పట్టనట్లు డీలరిచ్చిందే ఎరువు, పురుగు మందులు, విత్తనాలు అన్నట్లుగా డీలర్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వినివస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ అధికారులు చేస్తున్న తనిఖీలు సరైనవేనని ప్రజలంటున్నారు. డీలర్లు ఇచ్చిన ఫిర్యాదుతో ఎమ్మెల్యే రైతుల పక్షాన ఉంటారా లేక నాసిరకం, నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించి రైతులను ఇబ్బందులకు గురి చేసే డీలర్ల పక్కన ఉంటారా అని ప్రజలు గుస గుస లాడుకుంటున్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని విశాఖ డైరీ పాల ఉత్పత్తి రైతుల సేవా కేంద్రం వద్ద సోమవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు విశాఖ శంకర ఫౌండేషన్ నేత్ర వైద్య శిబిరం నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వైద్య పరీక్షకు వచ్చే వారు ఆధార కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌తో రావాలని తెలిపారు

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సతివాడ 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి రామతీర్థం రూరల్ ఫీడర్ కనస్ట్రక్షన్ రంగం వ్యవసాయ కనెక్షన్ పనులు కొనసాగింపు, కొమ్మలు తొలగింపు, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, బొడ్డపేట, వల్లూరు, మధుపాడ గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆర్‌ఎస్‌కెల ద్వారా సేవలు

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సేవలందిస్తున్నామని వ్యవసాయ సహాయక సంచాలకులు అలజంగి నిర్మలా జ్యోతి అన్నారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించి 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం ద్వారా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఖరీఫ్ పంటలకు సంబంధించి అన్నదాతలకు సలహాలు సూచనలు చేస్తున్న ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు.

విత్తనాలు పంపిణీ పరిస్థితి ఏంటి?

గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో రైతు సేవా కేంద్రాల ద్వారా 9,521 క్వింటాలు విత్తనాలను రాయితీపై పంపిణీ చేశాం. నేటి వరకు రైతులు నారుమడులను 30శాతం వేయగా మరో 70శాతం మంది వరినారు మడులను సిద్ధం చేసుకుంటున్నారు. రాయితీ విత్తనాలను ఒక్కో బస్తా 30 కేజీలు ఉండగా రాయితీపై 960 రూపాయలకు, సుడోమోనస్ పౌడర్‌ను 40 రూపాయలకు అందిస్తున్నాం.

విత్తనాలలో మొలకలు సమస్యలు ఏమైనా ఉన్నాయా?

సబ్ డివిజన్ పరిధిలో చాలా గ్రామాల్లో నారుమడులు లోతట్టు ప్రాంతాల్లో, నీరు నిలిచే చోట ఉండటంతో మొలక శాతం తక్కువగా వచ్చినట్లు మా దృష్టికి వచ్చింది. రైతులు కొనుగోలు చేసినప్పుడే విత్తనాల మొలక శాతం పరిశీలించి నారుమడులను వేసుకుంటే మంచిది.

ఎరువుల పరిస్థితి ఏంటి?

గజపతినగరం, బొండపల్లి, మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో సుమారు 12 వేలు హెక్టార్లలో (31,250 ఎకరాలు) వరి సాధారణ విస్తీర్ణంగా అంచనా వేశాం. వీటి ఆధారంగా సబ్ డివిజన్ పరిధిలో 72 ఆర్‌ఎస్‌కెలు ఉన్నాయి. వీటిలో ఇప్పటికే 149 టన్నులు ఎరువులు నిల్వ ఉంది. ప్రైవేట్ డీలర్స్ దగ్గర 1100 టన్నులు ఎరువులు నిల్వ చేసి ఉండటంతో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుల ఆందోళన చెందనవసరం లేదు. జులై చివరి నాటికి ప్రతి రైతు సేవా కేంద్రాల వద్ద కనీసం 10 టన్నులకు తగ్గకుండా ఎరువుల నిల్వ చేస్తాం. గతేడాది 2,289 టన్నులు ఎరువులు ఖరీఫ్ సీజన్‌లో వినియోగించగా 2025 ఖరీఫ్ సీజన్ సంబంధించి 2,500 టన్నులకు పైగా ఇండెంట్ పెట్టాం. దీని ద్వారా ప్రతి రైతుకు సకాలంలో ఎరువులు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

మాట్లాడుతున్న ఎడి నిర్మలా జ్యోతి

కౌలు రైతులు సంగతేంటి?

గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో 2,600 కౌలు కార్డులు టార్గెట్ ఉండగా పూర్తిస్థాయిలో కౌలు కార్డులను సంబంధిత రైతులకు అందజేశాం. ఈ కౌలు కార్డులు 11 నెలల పాటు కౌలు రైతు పంటనష్టం, బీమా, అమ్మకాలు చేసుకునే హక్కును కల్పిస్తాయి. ఇంకా కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాల్సిన వాళ్ళు సంబంధిత విఆర్‌ఒల ద్వారా దరఖాస్తులు చేసుకొని తమ దృష్టికి వస్తే తప్పకుండా పరిశీలించి కౌలు కార్డులు మంజూరు చేస్తాం.

భూసార పరీక్షల పరిస్థితి ఏంటి?

ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందే భూసార పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది కూడా ఏప్రిల్, మే నెలలో జిపిఎస్ ట్రాకింగ్ ద్వారా భూసార పరీక్షలు చేసి పరీక్షా కేంద్రాలకు పంపించాం. త్వరలో భూసార పరీక్ష పత్రాలను రైతులకు పంపిణీ చేస్తాం.

అధిక దిగుబడులు రావాలంటే రైతు ఏం చేయాలి?

విత్తనాలు వేసిన తర్వాత 20 నుంచి 25 రోజులు కాలంలో దమ్ము మడుల్లో ఒకటి నుండి రెండు పూసలు నారు తీసుకుని ఉడుపు ఉడవడం వల్ల అధిక దిగుబడులను పొందవచ్చు. సబ్ డివిజన్ పరిధిలో ఉన్న నాలుగు మండలాల్లో ప్రతి రైతుకూ యాంత్రికరణ, సాంకేతికతను జోడించి అధిక దిగుబడులు వచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాం. ఇటీవల రైతులకు వ్యవసాయంలో నూతన టెక్నాలజీని తీసుకువస్తూ రాయితీపై డ్రోన్స్ ఇచ్చాం. డ్రోన్ కావాలనుకుంటే ప్రభుత్వం 90 శాతం రాయితీతో ఇస్తుంది. రైతులు దీన్ని వినియోగించుకోవాలి అని ఆమె చెప్పారు.

ఎక్కడ చూసినా మేము చేసిన అభివృద్ధే

మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామాల్లో ఎక్కడ చూసినా వైసిపి చేసిన అభివృద్ధే కనిపిస్తుందని ఏడాది కూటమి ప్రభుత్వంలో ప్రజలకు చేసిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని టెక్కలి, చంద్రంపేట, జరజాపుపేట, గుషిణి గ్రామాల్లో బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కూటమి పాలన మోసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో శిలా ఫలకాలే తాము చేసిన అభివృద్ధిని చెబుతాయన్నారు. ఏడాది కూటమి పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయలేదు సరికదా అభివృద్ధి కూడా ఎక్కడా లేదన్నారు. హైటెక్ ఎమ్మెల్యేను ప్రజలు ఎన్నుకున్నారని, ఆమె దగ్గరకి వెళ్లాలంటే ఐదు ద్వారాలు 'దాటాల్సి ఉందన్నారు. కంపెనీలు పెడతానని యువతకు మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారని, ప్రస్తుతం ఊసే లేదన్నారు. మోసపోయామని ప్రజలే బాధపడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో జగనన్న ఇంటికే సంక్షేమ పథకాలను పంపించారన్నారు. ప్రజలు ఇప్పటికైనా చంద్రబాబు మోసాలను గ్రహించాలని కోరారు. అందరికీ అందుబాటులో ఉండేది తామేనని, దశాబ్దాలుగా ప్రజల కష్ట, సుఖాల్లో తోడుగా ఉంటున్నామన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా మాజీ మంత్రి బొత్స సత్యన్నారాయణ, జెడ్‌పి చైర్మెన్ మజ్జి శ్రీనివాసరావుతో పాటు తాను కూడా అండగా నిలబడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, వైసిపి మండల, పట్టణ అధ్యక్షులు గదల సన్యాసిఎ నాయుడు, చిక్కాల సాంబశివరావు, వైస్ ఎంపిపిలు పతివాడ సత్యన్నారాయణ, సారిక వైకుంఠం నాయుడు, సీనియర్ నాయకులు మత్స సత్యన్నారాయణ, దంతులూరి గిరిబాబు, సముద్రపు రామారావు, మద్దిల వాసు, రేగాన శ్రీనివాసరావు, జగన్నాథం, కర్రోతు వెంకటరమణ, చన మల్లు తులసి, సూర్యనారాయణ, జమ్ము అప్పలనాయుడు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

టిడిపితోనే అభివృద్ధి : కళా

ప్రజాశక్తి - చీపురుపల్లి

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి వీధిలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావుతో కలసి ఆయన ఆదివారం ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా లావేరు రోడ్డు నుండి సంఘం భవనం వరకు పల్లె పండగలో భాగంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.20.88 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డుని ఆయన ప్రారంభించారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని ఆయన ప్రజలకు వివరించారు. ఈ ఏడాది కాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన పనులకు సంబంధించి మహిళలను కళా వెంకట్రావు అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి రాష్ట్రంలో పరుగులు పెడుతోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు కామనాయుడు, గవిడి నాగరాజు, నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ముల్లు రమణ, వలిరెడ్డి శ్రీరాములు నాయుడు, కలిశెట్టి సత్యనారాయణ, సబ్బి సోనియా, రౌతు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

నిరసన తెలుపుతున్న జిందాల్ బాధితులు, నాయకులు

జిందాల్ అవకతవకలపై విచారణ చేయండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిందాల్ నిర్వాసితులు ఆందోళన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రతిరోజు పోలీసులను పెట్టి నిర్వాసితులను భయపడుతున్నారే తప్ప జిందాల్ యాజమాన్యం పాల్పడిన అవకతవకలపై విచారణ ఎందుకు జరపడం లేదని వెంటనే విచారణ చేపట్టాలని సిపిఎం నాయకుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. ఆదివారం బొడ్డవర హైవే రోడ్డు పక్కన జిందాల్ బాధితులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఆందోళన నిర్వహిస్తున్న కొంతమంది వద్దకు జిందాల్ యాజమాన్య ప్రతినిధులు వచ్చి మీకు భూమికి డబ్బులు ఇస్తాం, ఇల్లుకు డబ్బులు ఇస్తాం షేర్లకు డబ్బులు ఇస్తామని దందా నడుపుతున్నారన్నారు. అయినా ఎటువంటి విచారణ చేపట్టకపోవడం అన్యాయం అన్నారు. చదువు రాని అమాయక గిరిజన దళిత కుటుంబాలను నట్టేట ముంచుతున్న జిందాల్ ప్రతినిధులు ఏర్పాటు చేస్తున్న వారిపై ఎటువంటి చర్య లేదన్నారు. గిరిజనుల ముంచేసి ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్ పేరుతో కోట్లు సంపాదనే ధ్యేయంగా జిందాల్ నడుపుతున్న దందాను అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించు కోకపోవడం అన్యాయమన్నారు. అమాయక గిరిజనుల వద్ద నుంచి కొట్టేస్తున్న భూమిని చట్ట ప్రకారం వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. గిరిజనులు బాధితులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి- రేగిడి

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పిపి. నీలావతి తెలిపారు. ఆదివారం ఉంగరాడ మెట్ట వద్ద ఆమె విలేకరులతో మాట్లాడారు. చీపురుపల్లి సబ్ డివిజన్ మొత్తం ప్రస్తుతం సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున, పోలీస్ అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు ఇతర కార్యక్రమాలు, ప్రభుత్వ వ్యతిరేఖ కార్యక్రమాలు నిర్వహించ కూడదని హెచ్చరించారు. ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న పోలీస్ల అనుమతి తీసుకోవాలని, లేని పక్షంలో నిర్వహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. మండల ప్రజలు, అధికార, ప్రతిపక్ష, వామపక్షాల నాయకులు సహకరించాలని కోరారు.

ఎస్ఐ నీలావతి

పేద విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - రామభద్రపురం

పేద విద్యార్థినులకు బొబ్బిలికి చెందిన ప్రముఖ సామాజిక సేవా సంస్థ కారుణ్య ఫౌండేషన్ ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేసింది. నాయుడువలస పాఠశాలలో 8వ తరగతి ఉత్తీర్ణులై ఉన్నత పాఠశాలల్లో ప్రవేశం పొందిన 5 గురు పేద బాలికలకు కారుణ్య ఫౌండేషన్ చైర్మన్, నాయుడువలస పాఠశాల ఆంగ్లభాష సహాయకులు జేసి.రాజు సొంత నిధులు రూ.30వేలతో సైకిళ్లను కొనుగోలు చేసి గ్రామ సర్పంచ్ లక్ష్మీ, విశ్రాంత, ఎఇ నిడగంటి సత్యంల చేతులమీదుగా ఆదివారం గ్రామ సచివాలయం వద్ద అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా విద్యార్థులకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న జేసి రాజు కృషి అభినందనీయమని కారుణ్య సంస్థ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ అన్నారు. బాలికలు బాగా చదువుకొని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న జెసి రాజు

సిద్ధూకు ఎమ్మెల్యే అభినందన

ప్రజాశక్తి- బొబ్బిలి

బ్యాటరీ సైకిల్ తయారు చేసిన సిద్ధూని ఎమ్మెల్యే బేబినాయన అభినందించి, సత్కరించారు. తెర్లాం మండలం, జాడవారి కొత్తవలస గ్రామానికి చెందిన రాజాపు సిద్ధూ తన వినూత్న ఆలోచనలతో తక్కువ ఖర్చులో బ్యాటరీ సైకిల్‌ను తయారు చేశారు. సిద్ధూని ఆదివారం బొబ్బిలి కోటకు పిలిపించి ఎమ్మెల్యే బేబీనాయన అభినందించి, సత్కరించారు. తన ఆలోచనలకు మరింత పదునుపెట్టి, ఉన్నత స్థాయికి వెళ్ళాలని ప్రశంసిస్తూ కొంత ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా సిద్ధూ మాట్లాడుతూ తమ గ్రామం వ్యవసాయ ఆధారిత గ్రామమని, ఉన్న ఒక్క చెరువులో నీటిని వాడుకుంటూ దాదాపు 40 ఎకరాల భూమిని రైతులు సాగు చేసుకుంటున్నారని, తమ గ్రామ వ్యవసాయ భూమిలో రెండు బోరుబావులను నిర్మించి సోలార్ ద్వారా విద్యుత్ సదుపాయం కల్పిస్తే, రైతులు రెండవ పంటను పండించుకునే అవకాశం ఉంటుందని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వీలైనంత త్వరగా గ్రామానికి సాగునీరు ఏర్పాటు చేసేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్ధూ పెదనాన్న నేతేటి రామారావు, బంధువులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సిద్ధూని అభినందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కంట్రెడ్డి

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి ఎర్రవానిపాలెం గ్రామానికి చెందిన కంట్రెడ్డి రామన్న పాత్రుడు వైసిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈయన గతంలో విశాఖ పట్నం బీసీ సెల్ అధ్యక్షులుగా, విశాఖపట్నం పార్లమెంట్ బీసీ అధ్యక్షులుగా పని చేశారు. రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్‌గా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పనిచేసినప్పుడు డాక్టర్ టి సుబ్బరామిరెడ్డి, నేదురమల్లి జనార్దన్ రెడ్డిల సహకారంతో అనేక నిధులు తీసుకువచ్చానని తెలిపారు. ఉపాధ్యక్షులుగా అవకాశం కల్పించిన జగన్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ అవకాశం కల్పించిన మాజీమంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి పని చేస్తానని తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

కంటోన్మెంట్: విజయనగరం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న ఓ లాడ్జి నిర్వాహికుల పై విజయనగరం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. లాడ్జిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీ చేశారు .దీంతో రిసెప్షన్ తో పాటు లాడ్జి నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి-విజయనగరం కోట

వేర్వేరు చోట్ల గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తుల మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. జొన్నవలస రైల్వే గేటు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు విజయనగరం రైల్వే ఎస్ఐ బాలాజీ రావు తెలిపారు. సుమారు 25-30 ఏళ్ల వయస్సు కలిగిన పురుషుడి మృతదేహం ట్రాక్ వద్ద పడి ఉందని చెప్పారు. సుమారు 5.6 అడుగుల పొడవు, చామన ఛాయ రంగుతో ఉండి, ముదురు నీలం రంగు నైట్ ఫ్యాంటు, బిస్కెట్ కలర్ రౌండ్ నెక్ టీ షర్టు ధరించాడని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 919490617089, 9441013330 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అలమండ సమీపంలో..

అలమండ, కంటకాపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ట్రాక్‌పై గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు రైల్వే పోలీస్ ఎస్ఐ బాలాజీ రావు తెలిపారు. సుమారు 35-40 ఏళ్ల వయసు, సుమారు 5.5 అడుగుల పొడవు, ఎరుపు రంగు ఛాయతో ఉన్నారని చెప్పారు. గ్రీన్, పసుపు, ఆరంజ్ రంగు గల నైటీ ధరించారని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 919490617089కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కంటోన్మెంట్ : నగరంలోని నెహ్రూ పార్కు గోడకు పక్కన సుమారు 70 ఏళ్ల పురుషుడి మృతదేహం లభ్యమైందని టూటౌన్ సిఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. తెల్లటి గడుల షర్ట్ ధరించి, తెల్లటి గెడ్డంతో ఉన్నారని తెలిపారు. భిక్షాటన చేసుకునే వ్యక్తిలా ఉన్నారని చెప్పారు. మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మార్చురీకి తరలించామని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9154874474, 9121109420 నంబర్లను సంప్రదించాలని సూచించారు.